ప్రజాజ్యోతి

వరంగల్

ములుగు,మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ

ఆదివారం 13-07-2025 పేజీలు : 3




## 29 మంది మావోయిస్టుల లొంగుబాటు



కొత్తగూడెం, జూలై 12 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాతో పాటు భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో శనివారం మొత్తం 29 మంది మావోయిస్టు దళ సభ్యులు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ లోని సుకుమా జిల్లాలో 23 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిపై కోటి 18 లక్షల రివార్డు ఉందని సుకుమా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం, పీపీసీఎం, ఏసీఎం కమిటీ సభ్యులున్నారని, వారితో పాటు నలుగురు దంపతులు కూడా లొంగిపోయారని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే గతంలో మాజీ కలెక్టర్ అలెక్స్ పాల్ మీనన్‌ను కిడ్నాప్ చేసిన మావోయిస్టు లోకేష్ కూడా ఉన్నాడని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, అబూజ్‌మడ్ అడవుల్లో జరిపిన పలు విధ్వంసకర ఘటనల్లో వీరంతా నిందితులని ఎస్పీ పేర్కొన్నారు. మరోవైపు ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అధికారుల సమక్షంలో శనివారం ఆరుగురు మావోయిస్టు దళ సభ్యులు లొంగిపోయారు.

# వానమ్మా..రావమ్మా





వరంగల్ జూలై 12: వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచింది. ఇప్పటి వరకు ఒక్క భారీ వర్షం కురవలేదు. దీంతో వ్యవసాయ పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఎస్సారెస్పీ ఆయకట్టు కింద రైతులు మాత్రమే వరినాట్లు మొదలు పెట్టారు. మెట్ట ప్రాంతంలోని రైతులు నీళ్లు లేక వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ఒక్క భారీ వర్షం కురవకపోవడంతో బావులు, చెరువులు, కుంటలు నీళ్లు లేక వెలవెలబోతున్నాయి. ప్రతి సంవత్సరం జూలైలో వ్యవసాయ పనులు ఊపందుకునేవి. ఇప్పటికే 50 శాతం వరినాట్లు పూర్తయ్యేవి. ఇప్పటి వరకు రైతులు పోసిన నార్లు ముదిరిపోతున్నాయి. నార్లు పోస్తే నెల రోజుల్లో నాట్లు వేయాలి. పొలాలకు సరిపడా నీళ్లు లేక వర్షాల కోసం రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. హన్మకొండ డివిజన్‌లో సుమారు 1.20 లక్షల ఎకరాల్లో వ్యవసాయం చేస్తారు. 80 వేల ఎకరాల్లో వరి, 20 వేల ఎకరాల్లో పత్తి, 10 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 10 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తారు. ఇప్పటి వరకు 40 శాతం ఆయకట్టు కింద రైతులు వరినాట్లు వేశారు. రామడుగు మండలంలో 28 వేలకుపైగా వ్యవసాయ భూమి ఉండగా గత ఖరీఫ్‌లో 23,418 ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, కంది, తదితర పంటలు సాగు చేశారు. ఈ యేడు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం మండలంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతులకు ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నారు. ఇప్పటివరకు 168.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 117.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. సాధారణ వర్షపాతం కన్నా 30 శాతం తక్కువ నమోదు కావడంతో ఇప్పటి వరకు మండలంలో చెరువులు, కుంటల్లోకి నీళ్లు చేరలేదు. మండలంలో 11 చెరువులు, 63 కుంటలు ఉన్నాయి. మండలంలో 25 శాతం మాత్రమే వరి నాట్లు వేశారు. వ్యవసాయ బావులు, బోర్లలో నీరు అడుగంటింది. దీంతో రైతులు ఆకాశం వైపు చూస్తూ చూస్తున్నారు.



## బహిరంగ సభను విజయవంతం చేయాలి

### సభావేదిక ఏర్పాట్లను పరిశీలించిన నేతలు





హనుమకొండ జిల్లా ప్రతినిధి: జూలై 12,(ప్రజా జ్యోతి) తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండల కేంద్రంలో ఈ నెల 14న రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొనే బహిరంగ సభ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బోనగిరి పార్లమెంట్ ఇంచార్జులు కోటంరెడ్డి వినయ్ రెడ్డి, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నూతి సత్యనారాయణ గౌడ్, ఈ.వి. శ్రీనివాస్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు నరేష్, పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 9 మండలాలు, 2 పురపాలక సంఘాల అధ్యక్షులు బహిరంగ సభను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంగా పనిచేయాలని నేతలు సూచించారు. అనంతరం సభావేదిక ఏర్పాట్లను నేతలు పరిశీలించారు.

# ఆదివాసీ సమస్యలపై నిరంతర పోరాటం : తుడుందెబ్బ



**కొత్తగూడ జులై 12(ప్రజాజ్యోతి**

కొత్తగూడ మండలం కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ , ఆదివాసీ ఉద్యోగులు,పలు ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది..ఈ సమావేశం లో ఉమ్మడి కొత్తగూడ మండలం లోని ఏజెన్సీ ప్రాంత సమస్య లపై చర్చించడం జరిగింది.ఆదివాసీలు సాగు చేస్తుంటున్నా పోడు భూమి లన్నింటికి హక్కు పట్టాలు ఇవ్వాలి. సాగుదారులపై అటవీ అధికారుల దాడులను తిప్పి కొట్టాలి.ఆదివాసీలను భయభ్రాంతులకు గురి చేస్తున్న అటవీ అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలి.ఉమ్మడి మండలంలో ఆదివాసీ రైతులకు పట్టా బుక్ లు ఉన్న రైతు భరోసా అందడం లేదు అందరికి అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి . జీవో నెంబర్ 3 నీ పునరుద్ధరించే వరకు ఆదివాసీ సంఘాలు ఐక్యంగా పోరాడాలి.అంతే కాకుండా అన్ని ఏజెన్సీ చట్టాలను, జీవో లను పకడ్బందీగా అమలు చేసేవరకు సమిష్టిగా పోరాడుతామని వక్తలు పిలుపునిచ్చారు.ఆగస్టు 09 న కొత్తగూడ %ఽ% గంగారం మండల కేంద్రాలో జరుపతలపెట్టినా ప్రపంచం ఆదివాసీ దినోత్సవనికి అన్ని గ్రామాల దొర పటేల్లు, ఆదివాసీ యువకులు,ఆదివాసీ ప్రజలు,విద్య వేత్తలు హాజరై విజయవంతం చేయాలనీ కొరకు. ఇదే రోజున అన్ని గ్రామాల ప్రజలు తమ గ్రామాల్లో ఆదివాసీ జెండాను ఎగురా వేయాలని పిలుపునిచ్చారు... కార్యక్రమం లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి "తుడుం దెబ్బ" రాష్ట్ర ఉపాధ్యక్షులు భూర్క యాదగిరి,రాష్ట్ర కార్యదర్శి మల్లెల రాము, పూనెం సందీప్ దొర తుడుం దెబ్బ మండల అధ్యక్షులు కొత్తగూడ, పెనక సతీష్ మండల తుడుం దెబ్బ నాయకులు, ఆదివాసీ ఉద్యోగులు వట్టం సాయిలు, కల్తీ ఎల్లయ్య, చుంచ సారయ్య దొర,సువర్ణపాక సమ్మయ్య, పూనేం రాం చందర్, వాసం కిసెందర్, జెజ్జరీ శివ క్రిష్ణ, ఈసం నర్సింగ రావు, డా.పుల్స%శీ% సాంబయ్య, పూనేం పూర్ణ చందర్,ఈసం రంగా రావు,తాటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు...

# కామ్రేడ్ యాదగిరి యుగేందర్‌కు విప్లవ జోహార్లు

## -అఖిల భారత రైతు కూలీ సంఘం బయ్యారం

**బయ్యారం,జులై 12. ప్రజాజ్యోతి**

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల అఖిలభారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో వెంకట్రాంపురంలో కామ్రేడ్ దొరన్న స్మారక భవన్ లో అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ యాదగిరి యుగేందర్ సంతాప సభ శనివారం నిర్వహించారు. ఈ సంతాప సభలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్ర మురళి, నందగిరి సత్యం,వల్లాల బిక్షం,తూముల నరసింహారావు,దిడ్డి లింగయ్య, సిగ్గేమ్ సమ్మక్క,జంగిలి అశోక్,కాసిన బోయిన లింగయ్య, మునగాల సంపత్,రావుల వెంకటమ్మ,కొండ సాయమ్మ,




కన్నెబోయిన సుజాత తదితరులు పాల్గొన్నారు.

# పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

**బయ్యారం,జులై 12. ప్రజా జ్యోతి**

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం మిర్యాలపెంట గ్రామ పరిధిలోని సొంబ తండకు చెందిన గుగులోత్ విజయ్ అనే వ్యక్తి కొద్ది సంవత్సరాలుగా తీవ్ర తల నొప్పితో బాధపడుతున్నప్పుడు పిట్స్ వస్తుండేవి,ఈ పిట్స్ వ్యాధి తగ్గట్లేదని విజయ్ మనస్థాపం చెంది గురువారం పురుగుల మందు తాగాడు. విజయ్ నీ మహబూబాబాద్ గవర్నమెంట్ హాస్పిటల్ తరలించగా అక్కడి నుండి మెరుగైన వైద్యం నిమిత్తం ఎంజీఎం వరంగల్ హాస్పిటల్‌కి తరలించారు.

మరల తిరిగి మహబూ బాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు మృతుని అక్క బానోత్ దీప ఫిర్యాదు మేరకు బయ్యారం ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# పాల్కురికి సోమనాథుడు స్మృతి వనం అభివృద్ధి చేయాలి

**పాలకుర్తి, జూలై 12(ప్రజాజ్యోతి)**



మండల కేంద్రంలో ఆదికవి పాల్కురికి సోమనా థుడు స్మృతి వనం పరిశుభ్రత లోపించిందని అధికారుల నిర్లక్ష్యం తో అధ్వానంగా మారిందని, వెంటనే శు భ్రపరచి అభివృద్ధి చేసి ప్రభుత్వ వినియోగంలోకి తీసుకు రావాలని బీజేపీ మండల అధ్యక్షుడు మారం రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం బీజేపీ నాయకులు స్మృతి వనాన్ని సందర్శించి పరిశీలించిన అనంతరం జిల్లా నాయకుడు కమ్మగాని శ్రీకాంత్, దుంపల సంపత్,,మారం రవికుమార్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 80 లక్షల ఖర్చుతో నిర్మించిన ఈ స్మృతి వనం ఆదికవి పాల్కురికి సోమనాథుడి పేరిట గర్వకారణంగా ఉండాలి. కానీ, ప్రారంభించిన తరువాత దాని పై ఎటువంటి పరిరక్షణా చర్యలు తీసుకోకపోవడం వల్ల ఈ ప్రదేశం అసాంఘిక కార్య కలాపాలకు, పశువుల సంచారానికి కేంద్రంగా మారిందని, అత్యంత బాధాకరం. అని ఆవేదన వ్యక్తం చేశారు.శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులు స్మృతి వనాన్ని సందర్శించే సమయంలో అక్కడ కనిపించే మందు సీసాలు,డబ్బాలు, పగిలిన ప్లాస్టిక్ కవ్వులు, పేడను చూసి తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఇది ఆదికవి గౌరవానికి తూట్లు పొడిచే పరిస్థితి అని అన్నారు. పాల్కురికి సోమనాథుడు లాంటి మహాకవి గుర్తింపును సద్వినియోగం చేసుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం విచారకరం. వెంటనే జిల్లా కలెక్టర్ రంగంలోకి దిగి ఈ ప్రాంతాన్ని పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలి, అని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల దేవరాజు, పట్టణ అధ్యక్షుడు పబ్బా సంతోష్, మచ్చ సునీల్, కేరళ కర్ణాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డ మల్లికార్జున్ కు "తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం

## రంగస్థల పద్యనాటక కళారంగంలో విశిష్ట కళకు గౌరవం

**టేకుమట్ల జులై 12 ప్రజాజ్యోతి న్యూస్**



తెలుగు సాహిత్యం, నాటకరంగ అభివృద్ధికి అత్యున్నత స్థాయిలో కృషి చేసినప్రముఖులు అందుకునే తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం 2025 ను ఈ సంవత్సరంభూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామనికి చెందిన రంగస్థల పద్యనాటక కళాకారుడు దొడ్డా మల్లికార్జున్అందుకున్నారు.తెలుగు వెలుగు సాహితీవేదికఆధ్వర్యంలో ప్రతి ఏడాదీ దేశవ్యాప్తంగా వివిధ కళారంగాలలో విశేష కృషిచేసినసృజనశీలులను గుర్తించి,ఈ జాతీయ స్థాయి పురస్కారాన్ని అందజేస్తూవస్తోంది. దొడ్డా మల్లికార్జున్ పద్యనాటక రంగంలో చేస్తున్నకృషి అనిర్వచనీయమని, పద్యనాటకాలకు నూతనోత్తేజం కలిగించడంలోఆయన పాత్ర ప్రత్యేకమైనదని వేదిక నిర్వాహకులు తెలిపారు.అనేక పద్యనాటకాలను ప్రదర్శించడం, నటనలో గాఢతను కలిగించడం ద్వారా ఆయనఈ కళారంగాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లారు.పురస్కారం ప్రదానో త్సవం హైదరాబాద్‌లోఘనంగా నిర్వహించబడింది. సాహితీవేత్తలు, కళాకారులు,విశిష్ట అతిథులుపాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మల్లికార్జున్ కు సన్మానపూర్వకంగా బహుమతి,జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈపురస్కారంతో పద్యనాట కకళారంగంలో మల్లికార్జున్ కృషికి మరింత గుర్తింపు లభించినట్లు వేదిక నిర్వాహకులు పేర్కొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు పిపిఈ కిట్లు అందజేత

**వరంగల్ సిటీ, జూలై 12(ప్రజాజ్యోతి):**



పారిశుద్ధ కార్మికుల ఆరోగ్య సంరక్షణకు మహానగరపాలక సంస్థ అందించే పీపీఈ కిట్లు ఎంతోగానో దోహదపడతాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. శనివారం డివిజన్లోని ఎస్కే గౌడ్ కళాభవన్ లో బల్దియా ఆధ్వర్యంలో ఇచ్చిన కిట్స్ ను డివిజన్లో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులందరికీ కార్పొరేటర్ మరుపల్ల రవి చేతుల మీదుగా అందజేశారు. నిత్యం కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టడం వలన అనేకమంది అనారోగ్యం పాలవుతున్నరని గ్రహించి మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తరచుగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి తగిన వైద్యం అందిస్తున్నారని అలాగే పారిశుద్ధ కార్మికులకు కిట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి పారిశుద్ధ కార్మికులు తమ ఆరోగ్య రక్షణ కోసం ఆరోగ్య నియమాలు పాటించాలని కోరినారు. కిట్స్ పంపిణీ కార్యక్రమంలో డివిజన్ ఆఫీసర్ ఎన్ శంకర్, బిల్ కలెక్టర్ పి రాజ్ కుమార్, జవాన్లు ఆదామ్, రమేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

**టేకుమట్ల జులై 12 ప్రజాజ్యోతి న్యూస్**

హనుమకొండలో ఈ నెల16 న జరిగే బ్యాండ్ వాయిద్య కళాకారుల రాష్ట్ర సదస్సునువిజయవంతంచేయాలని మండల కేంద్రంలో శనివారం బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం టేకుమట్ల మండల అధ్యక్షులు పల్లెబోయిన సమ్మయ్య పోస్టర్నుఆవిష్కరించారు.ఈ సందర్భంగా సమ్మయ్యమాట్లాడుతూమండలంలోని వివిధ గ్రామాల మాస్టర్లు, ప్రోపరేటర్లు, బ్యాండ్ కళాకారులు అధికసంఖ్యలో హాజరై ఈసదస్సు ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాండ్ వాయిద్య కళాకారులు మదార్ సాబ్,రాజ్ మహమ్మద్, మహేందర్,రజాక్, నరేష్,దుర్గయ్య, నర్సయ్య,తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థికాభివృద్ధికి అవరోధం -పెరుగుతున్న జనసంద్రం

**వరంగల్ సిటీ, జూలై12 (ప్రజాజ్యోతి):**
నిర్ణీత ప్రాంతంలో నివసించే ఒకే జాతికి చెందిన జీవుల సమూహమే జనాభా. ఈ జనాభాను గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని వైయక్తిక ఆవరణ శాస్త్రం లేదా జనాభా జీవావరణ శాస్త్రం అంటారు. ఒక దేశ భూభాగం కన్నా జనాభా ఎక్కువగా ఉంటే దానిని అధిక జనాభాగా పేర్కొంటారు. జనాభా సిద్ధాంతాలలో మాల్థస్ బి జనాభా సిద్ధాంతం చాలా ముఖ్యమైనది. 1805 లో మాల్థస్ తన వ్యాసంలో పెరుగుతున్న పేదరికం,నిరుద్యోగత,అనారోగ్యం వంటి సమస్యలకు జనాభా పెరుగుదలే కారణమని జనసంఖ్య సిద్ధాంతాన్ని తీసుకువచ్చాడు, ఈ సిద్ధాంతం ద్వారా జనన,మరణాల రేటుకు ఆర్థికాభివృద్ధిలో గల మార్పులకు మధ్యగల సంబంధాన్ని తెలుసుకోవచ్చు. ఇంతింతై వటుడింతై అన్న చందముగా రోజు రోజుకూ ప్రపంచ జనాభా పెరిగిపోతున్నది. దీనివలన రాబోయే దుష్పరిణామాల గురించి ప్రజలలో చైతన్యం కలిగించడానికీ , ప్రపంచ జనాభా సమస్యలపై అవగాహన పెంచే లక్ష్యంతో ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకుంటున్నాము. ఈ కార్యక్రమం 1989లో యునైటెడ్ నేషన్స్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ యొక్క పాలక మండలచే స్థాపించబడింది. 1987 లో ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరగా ప్రజలలో లింగ సమానత్వం, పేదరికం వంటి జనాభా సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం కొరకు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుతున్నారు. 11/ 07/1987వ సంవత్సరంలో ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకున్నది. ఆరోజు జూలై 11 కాబట్టి ఆరోజును "ప్రపంచ జనాభా దినోత్సవం" గా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. అప్పటినుండి క్రమము తప్పకుండా ప్రతీ ఏడాది జూలై 11 వ తేదీన ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. ఆరోజు నుండి 20 సంవత్సరాల తర్వాత 2007లో ప్రపంచ జనాభా 6,602,226,172కు చేరినట్లు ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. ఆ తర్వాత 2008 నాటికి ప్రపంచ జనాభా 6.7 బిలియన్లు ఉండగా మరో యాభై ఏళ్ళలో ప్రపంచ జనాభా 9 బిలియన్లను మించవచ్చునని సమితి అంచనా వేసింది. మరియు ప్రపంచ వ్యాప్తముగా మహిళల సంతానోత్పత్తి శాతం 2.5 నుండి 2.1కి పడిపోతుందని సమితి తెలియజేసింది. ఇటీవల యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ విడుదల చేసిన స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ నివేదిక ప్రకారం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశముగా భారతదేశం మొదటి స్థానంలో నిలిచింది. ఈ నివేదిక ప్రకారం ప్రస్తుతం భారతదేశం జనాభా 142.86 కోట్లు కాగా చైనా జనాభా 142.57 కోట్లు, ఇదే విధముగా భారతదేశంలో జనాభా పెరిగితే 2050 నాటికి166.8 కోట్లకు చేరుతుందని అంచనా. 1950 నుండి ప్రతి ఏడాది దేశాల వారీగా జనాభా గణాంకాలను యూనియన్ విడుదల చేయగా ఇందులో చైనాను మించి భారతదేశం మొదటి స్థానంలో నిలవడం ఇదే తొలిసారి. ఐక్యరాజ్యసమితి డేటా యొక్క వరల్డ్ మీటర్ విశదీకరణ ఆధారంగా జూన్ 28,2023 నాటికి భారతదేశ ప్రస్తుత జనాభా 1,420,422,518 ఉండగా ప్రపంచ జనాభా ఎనిమిది బిలియన్లకు చేరింది. జనాభా వృద్ధిరేటు మందగిస్తున్న కారణముగా 2037నాటికి దాదాపు 9 బిలియన్లను చేరవచ్చునని అంచనా వేస్తున్నారు. పెరుగుతున్న జనాభాలో అభివృద్ధి చెందుతున్న దేశాలు కీలకపాత్ర పోషిస్తున్నట్టు ఐక్యరాజ్యసమితి అభిప్రాయపడింది. భారత్, అమెరికా, చైనా, బంగ్లాదేశ్ , తదితర తొమ్మిది దేశాలు 2050 నాటికి ప్రపంచ జనాభాలో సగం శాతాన్ని ఆక్రమిస్తాయని పేర్కొంది. నిరక్షరాస్యత మూఢాచారాలు, కుటుంబ నియంత్రణపై అవగాహన లేకపోవడమే జనాభా విపరీతముగా పెరుగుటకు కారణం, జనాభా ఇలాగే పెరుగుతుంటే పౌష్టికాహారలోపం, మరియు సరియైన సమయంలో వైద్య సహాయం అందకపోవడం వంటి సమస్యలతో మరణాల రేటు కూడా అధికమౌతుంది. నానాటికీ ప్రకృతి వనరులు తరిగిపోతున్నాయి, సహజ వనరుల్ని పొదుపుగా వాడేందుకు ఎవరూ ప్రయత్నించడం లేదు అలాగే జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలు, ఆర్థికంగా కుంగిపోవడం,నిరక్షరాస్యత,అవసరాలు తీరకపోవడం వంటి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలి ప్రజలు తమంతట తామే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకునేలా ప్రోత్సహించాలి,ఈ విధముగా ఎవరికి వారే జనాభాని యంత్రణకు పూనుకున్నట్లయితే ఆర్థికాభివృద్ధిని సాధించి భూ భారాన్ని తగ్గించగలము, ప్రకృతి సమతౌల్యతను కాపాడడం మనుషులుగా మనందరి బాధ్యత, అధిక జనాభాను నియంత్రించగలగడమే జాతిమనుగడకు సోపానమని మరువకుండా భావితరాల భవిష్యత్తుకు మనమంతా పునాదులమవుదాం.



**రచయిత:**
**అడ్డగూడి ఉమాదేవి,**
**తెలుగు అధ్యాపకురాలు,**
**సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల,**
**సిద్దిపేట.**
**9908057980.**

# చంటయ్యపల్లి గ్రామస్తులతో విపిఓ సమావేశం



**భీమదేవరపల్లి ,జూలై 13 (ప్రజా జ్యోతి):**
మండలంలోని చంటయ్యపల్లి గ్రామంలో ఎలుకతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్ ఎస్సై సాయిబాబు ఆదేశానుసారం గ్రామంలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ నరేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కానిస్టేబుల్ నరేష్ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, గ్రామాలలో గుట్కా, అంబారు లతోపాటు, నిషేధిత వస్తువులను అమ్మ రాదని, గ్రామాల్లో నకిలీ మద్యం తయారుచేసిన, నకిలీ కల్లు అమ్మిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుంటి ఓదెలు, గుర్రాల రాజు, మా రెడ్డి లక్ష్మారెడ్డి, కొన్ని సదానందం ,అలిగి రెడ్డి సతీష్, గుర్రాల నేపాల్ రెడ్డి, ముప్పు వెంకటయ్య, లింగాల అర్జున్ ,సాయి, కంతుల అనిల్, గొల్లపల్లి విపిఓ అనిల్ పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో ఒక్కరోజులోనే త్రాగునీటి సమస్యకు పరిష్కారం

### హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు.

**ఎల్కతుర్తి జూలై 12 (ప్రజాజ్యోతి)**



ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ లో భాగంగా చేస్తున్న రోడ్డు పనులవల్ల పైప్ లైన్ దెబ్బతింది.. బస్టాండ్ పరిసరాల్లోని కాలనీ వాసులకు త్రాగునీటి కి తీవ్ర ఇబ్బందికి గురి అయ్యారు. ఈ సమస్యను స్థానిక కాంగ్రెస్ నాయకులు డాక్టర్ బొల్లెపోగు రమేష్ బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. మంత్రి వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించి ఆదేశించడం జరిగింది. హుటాహుటిన ఎల్కతుర్తి గ్రామ కార్యదర్శి 42 పైప్ లు ఒక మోటార్ కూడా మంజూరు చేయడం జరిగింది. త్వరగా సమస్య ను పరిష్కారించినందుకు కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

## టాస్క్ ఫోర్స్, మట్టెవాడ పోలీస్, రెవెన్యూ అధికారుల తనిఖీలలో బట్టబయలు




**వరంగల్ సిటీ, జూలై 12 (ప్రజాజ్యోతి):**
నకిలీ బర్త్ సర్టిఫికెట్లు మరియు రెవెన్యూ సర్టిఫికెట్లు తయారుచేసి అమాయకుల వద్ద డబ్బులు దండుకుంటున్న కేటుగాన్ని వరంగల్ టాస్క్ ఫోర్స్, మట్టెవాడ పోలీస్ మరియు రెవెన్యూ అధికారులు ముకుమ్మడి దాడి చేసి పట్టుకున్నారు. వివరాలలోకెళితే హనుమకొండ నయీమ్ నగర్ కు చెందిన నల్లబెల్లి అమరేందర్(35) కొద్ది రోజుల క్రితం నగరంలోని పోచమ్మ మైదాన్, వేణురావుకాలనీ హనుమాన్ ఆన్లైన్ సెంటర్ పెట్టి ప్రభుత్వాన్ని, ప్రభుత్వ అధికారులను మోసం చేస్తూ అధికారుల యొక్క సంతకాలు ఫోర్జరీ చేస్తూ హైదరాబాద్ మున్సిపాలిటీకి చెందిన మరియు వరంగల్ రెవెన్యూ అధికారులకు సంబంధించిన సంతకాలతో ఫోర్జరీ చేస్తూ రెసిడెన్షియల్ మరియు మున్సిపాలిటీ బర్త్ సర్టిఫికెట్లను తయారు చేస్తున్నాడు. ఏజెంట్లను పెట్టుకొని ఆధార్ కార్డులో చేర్పులు మార్పులు కావలసిన ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అధిక డబ్బులు తీసుకొని జనన మరియు నివాస సర్టిఫికెట్లను తయారుచేసి ఆధార్ సెంటర్ల వారితో కుమ్మక్కై అందరి సహకారంతో ఆధార్ కార్డులు తయారు చేస్తున్నాడు. ఇట్టి ఫేక్ సర్టిఫికెట్లపై రెవెన్యూ ఇన్స్పెక్టర్ కురుపు దినకర్ ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన వరంగల్ టాస్క్ ఫోర్స్ అధికారులు మట్టెవాడ పోలీస్ అధికారులు మరియు రెవెన్యూ అధికారులు నమ్మదగిన సమాచారంతో ముకుమ్మడిగా తనిఖీలు నిర్వహించి సదరు నల్లబెల్లి అమరేందర్ ను పట్టుకొని అతని వద్ద హైదరాబాద్ మున్సిపాలిటీకి సంబంధించిన ఖాళీ ఫార్మాట్ పేపర్స్ మరియు మీసేవ ఫార్మాట్ పేపర్స్ ముద్రించినవి మరియు ప్రింటర్, కీబోర్డు, రెండు సెల్ ఫోన్స్ సీజ్ చేయనైనది. ఇతనిపై బిఎన్ఎస్ 318(2)(4),336(2) (3)337,340(1),(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించడమైనది. ఈ సందర్భంగా మట్టెవాడ ఇన్స్పెక్టర్ తుమ్మ గోపి మాట్లాడుతూ ప్రజలు ఇలాంటి నకిలీ ఆన్లైన్ మోసాల బారిన పడకుండా సంబంధిత ప్రభుత్వ అధికారుల ద్వారా మాత్రమే సర్టిఫికెట్స్ పొందవలెను. లేనిచో ఎవరు తప్పు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని తెలిపారు. నిందితుడిని పట్టుకొని కేసు పరిశోధనలో ప్రతిభ కనబరిచిన టాస్క్ ఫోర్స్ పోలీసులను మరియు మట్టెవాడ ఎస్సై సాంబయ్యను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.